## జిఎస్‌టి తగ్గింపుపై పడవల ర్యాలీ

**నరసాపురం:** జిఎస్‌టి తగ్గింపుపై శనివారం నరసాపురం గోదావరిలో సుమారు 50 పడవలతో ర్యాలీ నిర్వహించారు. సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా మత్స్యకారులకు అవగాహన కల్పించారు. జిఎస్‌టి తగ్గుదల వల్ల మత్స్యకారులు వినియోగించే వేట సామగ్రి ధరలు ఏ విధంగా తగ్గాయన్న దానిపై అవగాహన కల్పిస్తూ రాజుల లంక వరకూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని అమలు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయన్నారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ గూగుల్ రాక రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను మార్చుతుందన్నారు. ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార అభివృద్ధి ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు మాట్లాడారు. మత్స్య కార సహకార సంఘాలకు చెక్కులను మంత్రులు అందించారు. డిసిఎంఎస్ చాగంటి మురళీకృష్ణ, జనసేన నాయకులు పి.శ్రీనివాస్, ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, కె.వెంకటేశ్వర రావు, ఆర్‌డిఒ దాసిరాజు పాల్గొన్నారు.

# విభజిస్తారా.. ఉంచేస్తారా..!

**జిల్లాల విభజన సమస్యలపై ఉత్కంఠ**
**జిల్లా నుంచి విడిపోవాలని కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల్లో ఆందోళనలు**
**పోలవరం జిల్లా ఏర్పాటుపై వీడని సస్పెన్స్**
**జిల్లాల విభజనపై నియమించిన మంత్రుల కమిటీ ఏమైనట్టో**

నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లా కలపాలంటూ కొద్దిరోజుల క్రితం న్యాయవాదుల ధర్నా (ఫైల్‌ఫొటో)

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

జిల్లాల విభజన సమస్యలపై కూటమి సర్కార్ ప్రజల మనోభావాలతో ఆటలాడుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విభజన సమస్యలపై మంత్రులు కమిటీ నియమిస్తున్నట్లు ఆగస్టు ఆరో తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రకటించారు. నెల రోజుల్లో నివేదిక ఇస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. దాదాపు మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడిన పరిస్థితి లేదు. దీంతో జిల్లాల విభజన సమస్యలపై జనం రోడ్డెక్కుతున్న పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లా నుంచి విడిపోవాలని కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల్లో సాగుతున్న ఆందోళనలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. గత వైసిపి ప్రభుత్వం 2022లో జిల్లాల విభజన చేసింది. ఏప్రిల్ నాలుగో తేదీ నుంచి కొత్త జిల్లాల ఉనికి మొదలైంది. పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లాగా అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో కృష్ణా జిల్లాలోని నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలు ఏలూరు జిల్లాలో కలిశాయి. అంతేకాకుండా రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ద్వారకాతిరుమల మండలాన్ని భౌగోళిక కారణాలతో ఏలూరు జిల్లాలోనే ఉంచారు. నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలంటూ అక్కడి జనం అప్పట్లోనే కోరారు. తమకు విజయవాడ, మచిలీపట్నం అందుబాటులో ఉంటాయని, ఏలూరు దూరభారంగా మారడంతోపాటు రాకపోకలకు సౌకర్యంగా ఉండదని జనం నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. 2024లో ఎన్నికల సభలో నూజివీడులో జరిగిన సభలో ప్రస్తుత సిఎం చంద్రబాబు మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఏజెన్సీని పోలవరం జిల్లాగా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచిపోతుంది. ఇప్పటి వరకూ జిల్లాల విభజన సమస్యలపై ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది. నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని పెద్దఎత్తున నిరసనలు సాగుతున్నాయి. కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని అక్కడి ప్రజలు వినతులు ఇస్తూ పెద్దఎత్తున ఆందోళనలు సాగిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపనున్నట్లు ప్రచారం సాగడంతో అక్కడి ప్రజలు సైతం తమను 'పశ్చిమ'లోనే కొనసాగించాలని ఆందోళనకు దిగిన పరిస్థితి తెలిసిందే. పోలవరం జిల్లా ఏర్పాటుపై ఏజెన్సీ ప్రజల్లో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.

**మంత్రుల కమిటీ ఏమైనట్టు?**

జిల్లాల విభజనలో లోపాలు, సమస్యలకు సంబంధించి ప్రభుత్వం మంత్రుల కమిటీని నియమించింది. ఆగస్టు ఆరో తేదీన కమిటీని నియమిస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం నెల రోజుల్లో కమిటీ నివేదిక ఇస్తుందని తెలిపింది. నెలలు గడిచిపోతున్నా ఇప్పటి వరకూ మంత్రుల కమిటీ జిల్లాలో ఒక్కసారి కూడా పర్యటించలేదు. దీంతో జిల్లాల విభజన సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందా, లేదా అనే సందిగ్ధత నెలకొంది. విభజన సమస్యలపై నూజివీడు ఎంఎల్‌ఎ, మంత్రి కొలుసు పార్థసారథి, కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్‌పై జనం నుంచి తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. దీంతో నాయకులు సమాధానం ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏలూరు జిల్లాలో ప్రస్తుతం ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను విడదీయడంతోపాటు ఏజెన్సీ ప్రాంతాన్ని పోలవరం జిల్లాగా ఏర్పాటు చేస్తే ఏలూరు జిల్లాలో కేవలం నాలుగు నియోజకవర్గాలు మాత్రమే ఉంటాయి. గోపాలపురం నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో విలీనం చేసినా ఐదు నియోజకవర్గాలు అవుతాయి. జిల్లా అతిచిన్నదిగా మారిపోతుంది. దీంతో జిల్లాల విభజన సమస్యలను ప్రభుత్వం ఏవిధంగా పరిష్కరిస్తుందనే ఉత్కంఠ కొనసాగుతోంది. జిల్లాల విభజన సమస్యలపై ఏర్పాటు చేసిన కమిటీ అసలు ఉనికిలో ఉందా..లేదా అన్న ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. జిల్లాల విభజన సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రజల్లో అసహనం పెల్లుబుకు ప్రమాదం ఉంది. ఇప్పటికైనా జిల్లాల విభజన సమస్యలపై ప్రభుత్వం వెంటనే తగు నిర్ణయం తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

## చేనేత, హస్తకళా రంగానికి పూర్వ వైభవం తేవాలి

### కలెక్టర్ చదలవాడ నాగరాణి



నేతన్నను సత్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

**ప్రజాశక్తి - భీమవరం**

చేనేత, హస్తకళా రంగానికి పూర్వ వైభవం తేవాలని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ చదలవడ నాగరాణి కోరారు. అంతరించిపోతున్న హస్త కళలకు, చేనేత ఉత్పత్తుల పునర్జీవానికి క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఎపి సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ చేనేత, జౌళి శాఖ, క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఎపి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చేనేత దారులకు, చేనేత నైపుణ్య కార్మికుల సన్మాన కార్యక్రమానికి కలెక్టర్ నాగరాణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చేనేత రంగంలో వేల మంది కార్మికులు చేనేత వస్త్రాల తయారీలో జీవనోపాధి పొందుతున్నారన్నారు. జిల్లాలో ఎంతో నైపుణ్యం గల చేనేత కార్మికులు వివిధ కళాత్మక దుస్తులను తయారు చేస్తున్నారని తెలిపారు. ప్రపంచ దేశాల్లో చేనేత ఒకప్పుడు ప్రముఖంగా ఉండేదని, ఇప్పుడు భారతదేశంలో తప్ప మిగతా దేశాల్లో కనుమరుగైందని తెలిపారు. అర్హులైన చేనేత కార్మికులకు ప్రతినెలా పింఛన్ అందించడం జరుగుతోందన్నారు. ప్రజలు చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా చేనేత రంగాన్ని ఆదుకోవచ్చన్నారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఎపి సంస్థ సెక్రటరీ ఎస్.రంజన మాట్లాడుతూ అంతరించిపోతున్న హస్త కళలు, చేనేత పరిశ్రమను ముందుకు నడిపించడానికి పదేళ్ల తమ సంస్థ ద్వారా పని చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేనేత, జౌళి శాఖ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో చేనేత రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చారన్నారు. నవంబర్ 5, 6 తేదీల్లో చేనేత వస్త్ర ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సుదీర్ఘకాలంగా చేనేత రంగంలో తమ నైపుణ్యంతో చేనేత ఉత్పత్తులు చేస్తున్న చింతపర్రు గ్రామానికి చెందిన వీర గణపతి, వాసా భ్రమరాంబ, కె.వీర నరసన్నకు రూ.25 వేల నగదు బహుమతులను కలెక్టర్ చేతుల మీదుగా అందించి వారిని ఘనంగా సత్కరించారు. అదేవిధంగా చింతపర్రు, బగ్గేశ్వరం, రాయకుదురు, పాలకొల్లు, రామచంద్రపురం, దగ్గులూరు, భీమవరం, ఆచంట వేమవరం గ్రామాలకు చెందిన చేనేత కార్మికులను చేనేత కండువా వేసి కలెక్టర్ సత్కరించారు. సమావేశంలో జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఎ.అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, క్రాఫ్ట్ కౌన్సిల్ వైస్ ఛైర్మన్ బి.సుజాత, కౌన్సిల్ సభ్యులు పి.సునీత, డి.అవంతి, ఎస్.ప్రమీలారాణి, పి.సౌభాగ్య, సిహెచ్.లీల, వివిధ గ్రామాలకు చెందిన చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## మానసిక వికాసానికి బాలోత్సవాలు దోహదం

- అమరావతి బాలోత్సవాల నిర్వాహకులు మురళీకృష్ణ
- డిసెంబర్ 11,12వ తేదీల్లో భీమవరం బాలోత్సవాలు
- బాలోత్సవ కమిటీ అధ్యక్షులు ప్రసాద్ రాజు

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నేతలు

**ప్రజాశక్తి - భీమవరం**

బాలల్లో మానసిక వికాసానికి బాలోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని అమరావతి బాల ఉత్సవాల నిర్వాహకులు పి.మురళీకృష్ణ అన్నారు. భీమవరం మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో శనివారం భీమవరం బాలోత్సవ సంఘం కమిటీ ప్రధాన కార్యదర్శి సిహెచ్.పట్టాభిరామయ్య అధ్యక్షతన బాలోత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అమరావతి బాలోత్సవం నిర్వాహకులు పి.మురళీకృష్ణ హాజరై మాట్లాడారు. బాలోత్సవాలు నిర్వహించడం వల్ల వీటిలో పాల్గొనే బాలల్లో మానసిక వికాసం, వివిధ కళారూపాల నైపుణ్యం, దేశభక్తి, మానవత్వ విలువలు, నైతిక విలువలు పెంపొందుతాయన్నారు. ఇవి పిల్లలను ఇవి ఎంతో చైతన్యం చేస్తున్నాయన్నారు. బాలల ప్రతిభా పాటవాలు, శక్తి యుక్తులు పెరుగుతున్నాయన్నారు. ఆట పాటలు, వ్యాయామం, శారీరక శ్రమ తగ్గిపోతున్న నేటి తరుణంలో ఇవి ఎంతగానో పిల్లలకు ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ బాలోత్సవాల నిర్వహణకు అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, దాతల నుంచి ఆదరణ లభిస్తున్నాయని తెలిపారు. ఈ ఉత్సవాలను చూసి అనేక మంది దాతలు ముందుకొస్తున్నారన్నారు. భీమవరం బాలోత్సవ కమిటీ అధ్యక్షులు ప్రసాద్‌రాజు మాట్లాడుతూ భీమవరంలో డిసెంబర్ 11, 12 తేదీల్లో జరిగే బాలోత్సవాలకు భీమవరం పట్టణం, కాళ్ల, ఆకివీడు, ఉండి, పాలకోడేరు, వీరవాసరం పాఠశాలల నుంచి బాల బాలికలు మరింత ఎక్కువ మంది పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. కల్చరల్, అకాడమిక్ అంశాల నుంచి గతం కంటే ఎక్కువ ఈ వెంట్స్ చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనే విద్యార్థులు ఇప్పటినుంచే సాధన మొదలుపెట్టి తమ నైపుణ్యాన్ని కనబర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బాలోత్సవ కమిటీ సభ్యులు గాతల జేమ్స్, పి.సీతారామరాజు, మల్లుల శ్రీనివాస్, జి.రఫాయేలు, కల్చరల్ అంశాలు, అకాడమిక్ అంశాల నిర్వాహకులు చైతన్య ప్రసాద్, పి.శ్రీనివాసరాజు, చాన్‌బాషా, అల్లు శ్రీనివాస్, ముచ్చర్ల త్రిమూర్తులు, తణుకు బాలోత్సవం దక్షిణామూర్తి పాల్గొన్నారు.

## కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

### సంఘం ఆధ్వర్యాన తహాశీల్దార్‌కు వినతి

తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

**ప్రజాశక్తి - పోడూరు**

కౌలు రైతుల పట్ల గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే కూటమి ప్రభుత్వం కొనసాగించడం దారుణమని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. కౌలు రైతులకు రుణ గుర్తింపు కార్డులు, అన్నదాత సుఖీభవ, పంట రుణాలు ఇవ్వాలని తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వం భూయజమానులు అంగీకరిస్తేనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని షరతులు పెట్టడంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కూటమి ప్రభుత్వం అదే విధానాలను అమలు చేయడంతో నూటికి 40 మందికి కూడా వాస్తవంగా గుర్తింపు కార్డులు అందడంలేదని, భూస్వాములు, భూయజమానులు పంటలు పండిస్తున్న కౌలు రైతులను కనీసం పంట నమోదు కూడా చేయనీయడం లేదన్నారు. అయినా అధికారులు గానీ, ప్రజా ప్రతినిధులు గానీ వారి సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. తక్షణం కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చి, పెట్టుబడి సాయం రూ.20 వేలు, బ్యాంకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు ఇంజేటి శేఖర్‌బాబు, బూరాడి శ్రీనివాస్, కోట ఠాగూర్, గుబ్బల రామస్వామి, తానేటి వెంకటేశు పాల్గొన్నారు.

## సమానత్వం కోసం పోరాటం

**సమాజంలో స్త్రీ, పురుష భేదాలు కొనసాగడం బాధాకరం**
**ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వెన్షన్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పావని**
**పాఠ్యాంశాల్లో మతోన్మాదాన్ని చేర్చడం దారుణం : ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్**

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిహెచ్.పావని

**ప్రజాశక్తి - భీమవరం**

సమాజంలో సమానత్వం కోసం పోరాడాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని దీనికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పనిచేస్తోందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిహెచ్.పావని అన్నారు. సమాజంలో స్త్రీ, పురుష భేదాలు నేటికీ కొనసాగడం అత్యంత బాధాకరమన్నారు. భీమవరం యుటిఎఫ్ భవనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వెన్షన్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కన్వెన్షన్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పావని ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కన్వెన్షన్‌లో పావని మాట్లాడుతూ సమాజంలో అసమానతలు రాజ్యమేలుతున్నాయని, రాజ్యాంగంలోని సమాన హక్కుల సాధనకు అంతా నడుం బిగించాలని తెలిపారు. సమానత్వంతో కూడిన విద్య అందించాలన్నారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని, నేటికి స్వాతంత్రం వచ్చి 78 ఏళ్ల అయినా మహిళలకు రక్షణ లేదన్నారు. విద్యార్థులపై పాఠశాలలో, కళాశాలలో లైంగిక వేధింపులు, దాడులు నిరంతరం జరుగుతున్నాయన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థినులకు విద్య అందడం లేదని, విద్యా సంస్థలో ప్రయివేటీకరణ చేయడం వల్ల విద్య అందని ద్రాక్షలా మారిందని తెలిపారు. ప్రభుత్వం అందరికీ సమానత్వంతో కూడిన విద్య అందించాలన్నారు. నూతన విద్యా విధానం వల్ల లక్షల మంది అమ్మాయిలు విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యార్థులకు తీరని ద్రోహం చేసిందన్నారు. దీనిలో ముఖ్యంగా నష్టపోంది విద్యార్థినులే అన్నారు. జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ చరిత్ర పాఠ్యాంశాలను తీసివేసి మతోన్మాదంతో మూఢనమ్మకాలను పాఠ్యాంశంలో పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస అవకాశాలు కల్పించకపోవడం సిగ్గుచేటు అన్నారు. అనేక మంది విద్యార్థినులపై హత్యలు, లైంగిక వేధింపులు జరుగుతూనే ఉన్నాయన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన వెంటనే తాను పెట్టబోయే మొదటి సంతకం సుగాలి ప్రీతి కేసుపై అని బహిరంగ సభలో చెప్పారని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలవుతున్నా ప్రీతి కేసు గురించి పట్టించుకోలేదని విమర్శించారు.

**14 మందితో నూతన కమిటీ ఎన్నిక**

14 మందితో జిల్లా కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా సింధు, కో కన్వీనర్‌గా టి.రేష్మ, ఎం.భాగ్యలక్ష్మి, కమిటీ సభ్యులుగా పద్మజ, జాహ్నవి, కీర్తి, సిరి, పావని, ప్రియా, లాస్య, స్వరూప, జ్యోతి, రేణుక, భవాని, సలోని ఎన్నికయ్యారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలని ధర్నాలు

నరసాపురం : కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు, నాయకులు

ఏనుగువానిలంక పంచాయతీ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

**ప్రజాశక్తి - నరసాపురం**

వేములదీవి తూర్పు గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం సచివాలయ కార్యదర్శి అడిదల కళ్యాణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ గ్రామంలోని రామాంజనేయపురం, ప్రకాశపురం ఏరియాలో కుళాయిల ద్వారా మురుగునీరు వస్తోందని తెలిపారు. ఆ నీరు తాగడం వల్ల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశుధ్యం సక్రమంగా లేకపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగి ప్రజలకు అనారోగ్యం కలిగిస్తున్నాయన్నారు. పారిశుధ్యం మెరుగుపర్చడానికి, స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి పంచాయతీ అధికారులు తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుబ్బల నాగేశ్వరరావు, గ్రామస్తులు బర్రె నాగమణి, తిరుమాని ధనలక్ష్మి, ఒడుగు నాగలక్ష్మి, బస్వాని సీతమ్మ, తిరుమాని నాగమణి, పట్టెం వరలక్ష్మి, పట్టెం ధనలక్ష్మి పాల్గొన్నారు.

**యలమంచిలి :** ఏనుగువానిలంక గ్రామంలో ప్రతి రోజూ తాగునీరు సరఫరా చేయాలని శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం యలమంచిలి మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి గ్రామంలో రెండు రోజులకోసారి కుళాయి నీరు ఇవ్వడం వల్ల గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రయివేటు వారి వద్ద తాగునీటిని రోజుకు వంద రూపాయలు పెట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వర్షాకాలంలో నీరు పుష్కలంగా ఉన్న సమయంలో కూడా రెండు రోజులకోసారి ఇవ్వడం అన్యాయమని గ్రామ పంచాయతీ పాలకవర్గం, అధికారులు తక్షణం స్పందించి ఏనుగువానిలంక గ్రామస్తులకు ప్రతిరోజూ రక్షిత తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మాసవరపు సుబ్బారావు, గుబ్బల విష్ణు, ఉల్లంపర్తి చంటి, బొక్కా వెంకటేశ్వరరావు, ఇంటి సత్యనారాయణ, త్రిమూర్తులు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రకటనలు ఫుల్.. ఆచరణ నిల్..!

**నకిలీ మద్యం గుర్తించడానికి ఎక్సైజ్ శాఖ సురక్ష యాప్ తీసుకురావడం, కర్నూలులో జరిగిన జిఎస్‌టి సభకు జిల్లా నుంచి జనాన్ని తరలించడం రెండు జిల్లాల్లో సర్వత్రా చర్చనీయాంశమైంది.**

నకిలీ మద్యం అంశంపై అటు ప్రభుత్వ హడావుడీ, వైసిపి ఆందోళనలతో జిల్లాలోనూ చర్చనీయాంశమైంది. గతంలో జంగారెడ్డిగూడెంలో మద్యం కారణంగా పలువురు మృతి చెందిన అంశాన్ని అంతా గుర్తు తెచ్చుకుంటున్నారు. అయితే మద్యం అమ్మకాలను ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాలు ఉన్నప్పుడు నకిలీ మద్యం అరికట్టడం ఎలా సాధ్యమనే ప్రశ్న అందరిలోనూ ఉత్పన్నమవుతోంది. రెండు జిల్లాల్లోనూ వేళాపాళా లేకుండా మద్యం అమ్మకాలు సాగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. అదే సమయంలో మద్యం దుకాణాల వద్ద ఘటనలు జరిగినప్పుడు కనీసం మానవత్వం చూపకుండా బాధితులను అలానే వదిలేస్తున్నారనేది ఇటీవల ఏలూరులో జరిగిన రెండు ఘటనల్లోనూ స్పష్టమైంది. ఏలూరులో మద్యం దుకాణం వద్ద ఒక వ్యక్తి మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందే. తాజాగా మరో వ్యక్తి మద్యం మత్తులో మద్యం దుకాణం వద్ద పడిపోయి తలకు తీవ్ర గాయమైతే పోలీసులు రంగంలోకి దిగి ఆస్పత్రికి పంపాల్సి వచ్చింది గానీ మద్యం దుకాణం నిర్వాహకులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇక నకిలీ మద్యం గుర్తించడానికి బాటిల్‌పై లేబుల్‌ను స్కాన్ చేస్తే వివరాలు తెలుస్తాయంటూ ఎక్సైజ్ శాఖ సురక్ష యాప్ తీసుకురావడం 'నవ్విపోదురుగాక మాకేటి సిగ్గు' అనే చందంగా ఉందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. మద్యానికి బానిసై ప్రాణాలు కోల్పోతున్న వారు కార్మికులు, పేదలే ఉంటున్నారు. వారి వద్ద స్మార్ట్ ఫోన్ ఉంటుందా, లేక ఉన్నా అవన్నీ తెలుసుకునే అవగాహన వారికి ఉంటుందా, లేదా అనేది అందరికీ తెలిసిందే. నకిలీ మద్యంతో మృతి చెందిన కుటుంబాల్లో చాలామంది నిరక్షరాస్యులు ఉన్నారనేది జంగారెడ్డిగూడెం ఘటన స్పష్టం చేసింది. మరి నకిలీ మద్యం తయారీని అడ్డుకుని, మద్యం అమ్మకాలను నియంత్రించి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ఎక్సైజ్ శాఖ, ప్రభుత్వం తమకేమీ సంబంధం లేదన్నట్లు ఒక యాప్ విడుదల చేసి చేతులు దులుపుకోవడం బాధ్యతారాహిత్యమే అనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా బెల్టుషాపులను, లూజు అమ్మకాలను నియంత్రిస్తే నకిలీ మద్యం అరికట్టే అవకాశం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్భాటపు ప్రకటనలు మాని ఆ దిశగా ఆచరణలో చర్యలు తీసుకోకపోతే ఈ ప్రభుత్వానికి చెడ్డ పేరు తప్పదని హెచ్చరిస్తున్నారు.

ఇక కర్నూలులో జరిగిన జిఎస్‌టి సభకు పశ్చిమగోదావరి జిల్లా నుంచి ప్రత్యేక బస్సుల్లో జనాన్ని తరలించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అసలు జిఎస్‌టి తగ్గింపు ప్రతిఫలాలు జనానికి చేరేలా చూడాల్సిన పాలకులు, అధికారులు సైతం ఆ దిశగా చర్యలు మాని ప్రచార ఆర్భాటం సాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధరలు పెరిగినప్పుడు మాత్రం గంటల వ్యవధిలో ఎంఆర్‌పిపై పెరిగిన ధరలతో కొత్త స్టిక్కర్ వేసి వస్తువుల అమ్మకాన్ని జనం గుర్తు చేస్తున్నారు. జిఎస్‌టి తగ్గింపుతో ధరలు తగ్గించి అమ్మాల్సినా ఎంఆర్‌పి, కంపెనీ తగ్గించలేదని, అధికారిక ఉత్తర్వులు రాలేదని వ్యాపారులు వినియోగదారులకు మొండిచెయ్యి చూపుతున్నారు. ఈ విషయం రెండు జిల్లాల్లోని ఉన్నతాధికారులకు తెలుసు. మరి ఆ సమస్యలు పరిష్కరించకుండా ఈ ప్రకటనల ఆర్భాటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. భీమవరంలో జిఎస్‌టి బెనిఫిట్ బజారు ఏర్పాటు చేయడమంటే వ్యాపార సంస్థలు ధరల తగ్గింపునకు ససేమిరా అంటున్నాయనేది స్పష్టమవుతోంది. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ప్రచార ఆర్భాటాలు మాని క్షేత్రస్థాయిలో జనానికి జిఎస్‌టి తగ్గింపు ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

**- వివిఎస్‌వి.ప్రసాద్**

## ఇకెవైసితో అవినీతి నిర్మూలన అనడం సరికాదు

మాట్లాడుతున్న సత్యనారాయణ

**ప్రజాశక్తి - గణపవరం**

ఉపాధి హామీలో ఇకెవైసితో అవినీతిని నిర్మూలిస్తామని చెప్పడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. శనివారం కేశవరం ఉద్దరాజు రామం నగర్‌లో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం మండల తొమ్మిదో మహాసభలో పాల్గొని మాట్లాడారు. ఈ మహాసభకు పెచ్చేట్టి ఓంకారమ్మ అధ్యక్షత వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా సంఘం పతాకాన్ని చింతపల్లి పార్వతి ఆవిష్కరించారు. మహాసభలో సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా అవినీతి ఉండదని చెప్పారని గుర్తు చేశారు. అవినీతి నిర్మూలన యాప్‌ల ద్వారా లేకుండా చేస్తానని చెప్పడం గొంగట్లో తింటూ వెంట్రుకలు ఏరుకోవడమేనని విమర్శించారు. ఉపాధి హామీ పని దినాల పెంపు, బడ్జెట్లో నిధులు పెంచే విధంగా కేంద్రం చర్యలు చేపట్టాలన్నారు కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పెచ్చేట్టి నరశింహమూర్తి మాట్లాడుతూ ఆక్వా సాగు వల్ల వరిసాగు తగ్గిపోయిందని, ఉపాధి పని చూపకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు మండల కార్యదర్శి నరాలశెట్టి రామకృష్ణ మహాసభలో నివేదికను ప్రవేశపెట్టగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం మహాసభ నూతన కమిటీని ఎన్నుకుంది. కమిటీ నూతన మండల అధ్యక్షులుగా సోడదాసి సంజీవీరావు, కార్యదర్శిగా నరాలశెట్టి రామకృష్ణ, మరో పది మందితో నూతన కమిటీ ఎన్నికైంది.

# రద్దీగా ఆర్‌టిసి బస్సులు..!

**జనాల తాకిడితో పలువురు ఇబ్బంది**

**బస్సులు పెంచాలని ప్రయాణికుల వేడుకోలు**

ప్రజాశక్తి - పెనుమంట్ర



బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

మండలంలోని మార్టేరు సెంటర్‌లో ఆగే తాడేపల్లిగూడెం-ఆచంట ఆర్‌టిసి ఒక్క బస్సుకు రెండు బస్సులు పట్టే జనాల తాకిడి ఉంటోందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఈ మార్గంలో గతంలో ఉదయం నుండి రాత్రి వరకు కేవలం ఐదు బస్సులు మాత్రమే తిరిగేవని, స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అమలు అయ్యాక 12 బస్సులు తిరుగుతున్నా జనాన్ని ఆపడం కష్టం అవుతుందని డ్రైవర్లు, కండక్టర్లు అంటున్నారు. ఈ ఒత్తిడి వల్ల వృద్ధులు, చంటి పిల్లలు, తల్లులు ఇబ్బంది పడుతున్నారని, ప్రయాణికుల సౌకర్యం కోసం మరికొన్ని ట్రిప్పులు ఈ మార్గంలో వేసేలా ఆర్‌టిసి చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

## న్యాయ సేవా సహాయ కేంద్రం ప్రారంభం

**తాడేపల్లిగూడెం :** తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా ఆదేశాల మేరకు శనివారం పెంటపాడు పంచాయతీ కార్యాలయంలో లీగల్ ఎయిడ్ క్లినిక్(న్యాయ సేవా సహాయ కేంద్రం)ను ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎస్.సూర్య కిరణ్‌శ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు న్యాయాన్ని చేరువ చేసేందుకు, సమస్యల పరిష్కారానికి ఈ న్యాయ సేవ సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ లీగల్ ఎయిడ్ క్లినిక్‌కు ప్యానల్ అడ్వకేట్‌గా శనివారపు వెంకట రామకృష్ణ, పార లీగల్ వాలంటీర్‌గా కేశవరావును నియమించారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు తహశీల్దార్ రాజరాజేశ్వరి, ఎండిఒ పోలీసు అధికారులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిరిగినీడి విజయకృష్ణ, మహిళా రిప్రెజెంటేటివ్ ఎం.సత్యవాణి పాల్గొని మాట్లాడారు.

**గణపవరం :** గణపవరం పరిసర ప్రాంతాల ప్రజలకు న్యాయ సలహాల కోసం ప్రతీ శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద న్యాయవాది ధనుకొండ సాయికుమార్ ఉంటారని తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి కె.మాధవి తెలిపారు. శనివారం గణపవరం పంచాయతీ వద్ద న్యాయ సలహా కేంద్రాన్ని మాధవి ప్రారంభించి మాట్లాడారు. ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి, డిప్యూటీ ఎంపిడిఒ పి.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు కూసంపూడి సురేందర్ కుమార్ రాజు పాల్గొన్నారు.

## గుండెపోటుతో సచివాలయ ఉద్యోగి మృతి

**పోడూరు :** మండలంలోని గుమ్ములూరు గ్రామ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుక్కల జ్యోతి కుమార్(49) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. జ్యోతి కుమార్‌కు భార్య లక్ష్మీ నరసమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జ్యోతి కుమార్ హఠాత్తుగా గుండెపోటుతో మృతిచెందడం ఎంతో బాధాకరమని గ్రామ సర్పంచి గొట్టుముక్కల సోనియా రమేష్, ఎంపిడిఒ బి.మంగాకుమారి, పలువురు సచివాలయ ఉద్యోగులు సంతాపం వ్యక్తం చేశారు.

## 21న హాకీ జట్ల ఎంపికలు

**వీరవాసరం :** ఈనెల 21న విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హాకీ జట్ల ఎంపికలు జరుగుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు డి.సునీత, పిఎస్ఎన్.మల్లేశ్వరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 బాలబాలికల విభాగంలో నిర్వహించే ఈ ఎంపికలు భీమవరం భారతీయ విద్యాభవన్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు ఉదయం తొమ్మిది గంటలకు రిపోర్టు చేయాలన్నారు. వివరాలకు 8074153923ను సంప్రదించాలని తెలిపారు.

## సూపర్ జిఎస్‌టిపై అవగాహన

**గణపవరం :** గణపవరం డిగ్రీ కాలేజీలో శనివారం జిఎస్‌టిపై విద్యార్థులకు, వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయవాడ జిఎస్‌టి కేంద్ర విభాగం అసిస్టెంట్ కమిషనర్ పాకలపాటి మరియదాసు జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. జిఎస్‌టి సూపరింటెండెంట్ ఎం.నాగేశ్వరరావు జిఎస్‌టి తగ్గింపు వల్ల వినియోగదారులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి, రిటైర్డ్ వైస్ ప్రిన్సిపల్ వై.మధురాజు, కెవి.గణేష్ కుమార్, శ్రీనివాసరావు, సిహెచ్.చైతన్య, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

## తహశీల్దార్‌కు సన్మానం

**ఆచంట :** స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఆచంట తహశీల్దార్ జి.కనకరాజును శనివారం కార్యాలయ సిబ్బంది, మండల రేషన్ డీలర్లు కలిసి అభినందించారు. ఏడాదికాలంగా ఆయన ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారిగా ఆయన జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు సాలువా కప్పి సత్కరించారు. డిప్యూటీ తహశీల్దార్ సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్టాఫీస్ సందర్శన

**నరసాపురం :** బిఆర్ ఎంవి ఎంపి హైస్కూల్ బిఎఫ్ఎస్ఐ ట్రేడ్‌కు చెందిన లెవల్-1, లెవల్-2 విద్యార్థులు నరసాపురంలోని మెయిన్ పోస్టాఫీస్‌ను సందర్శించారు. ఈ సందర్శనలో పోస్టుమాస్టర్ కెవిఎన్ఎస్ఎస్.మూర్తి, పోస్టాఫీస్ సిబ్బంది విద్యార్థులకు పోస్టాఫీస్‌లో జరిగే వివిధ కార్యకలాపాల గురించి విపులంగా వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఒకేషనల్ ట్రైనర్ బిఎఫ్ఎస్ఐ ట్రేడ్ ఎ.పుష్పమణి పాల్గొన్నారు.

## టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి

**తహశీల్దార్ పవన్ కుమార్**

**యలమంచిలి :** అనుమతులు లేకుండా దీపావళి టపాసుల దుకాణాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్ హెచ్చరికను జారీ చేశారు. ఈమేరకు శనివారం తహశీల్దార్ కార్యాలయంలో దీపావళి టపాసులు, మందుగొండి సామగ్రి తాత్కాలిక దుఖానాల దరఖాస్తు దారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. యలమంచిలిలో మొత్తం 10 షాపులకు దరఖాస్తులు వచ్చినట్లు తెలియజేశారు.

## విద్యార్థి తలకు తీవ్ర గాయం

**పాలకొల్లు ఆసుపత్రికి తరలించిన బస్సు డ్రైవర్, స్థానికులు**

**పెనుమంట్ర :** కళాశాల నుండి మార్టేరు-పాలకొల్లు రోడ్డు వైపు ఉన్న బస్ స్టాప్ వద్ద ఆర్‌టిసి బస్సు కదలడం వల్ల ఫుట్ బోర్డు మీద నిల్చున్న విద్యార్థి కింద పడి తీవ్రంగా గాయపడిన సంఘటన నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం శనివారం మధ్యాహ్నం రావులపాలెం నుండి నరసాపురం వచ్చే ఆర్‌టిసి బస్సు మార్టేరు సెంటర్‌లో పాలకొల్లు వైపు ఉన్న బస్‌స్టాప్‌లో ఆగింది. బస్ ఆగిన కుదుపుకు పెనుగొండ కళాశాల స్టేజ్‌లో బస్ ఎక్కిన ఆచంటకు చెందిన విద్యార్థి ఫుట్ బోర్డు నుండి జారి పడడంతో తలకు తీవ్రంగా గాయం అయిందని, బస్ డ్రైవర్, కండక్టర్ స్థానికుల సాయంతో పాలకొల్లు ఆసుపత్రికి తరలించినట్లు సెంటర్ లోని చిన్న కార్ల డ్రైవర్స్ తెలిపారు. ఈ సంఘటన గురించి సమాచారం లేదని స్థానిక పోలీసులు అన్నారు.

# గ్రామీణ వైద్యులే నిజమైన ప్రజా వైద్యులు

**ఎపి పిఎంపి, ఆర్‌ఎంపి జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవాధ్యక్షులు టిడి.జనార్ధన్**



మాట్లాడుతున్న ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అత్యవసర సమయాల్లో బేసిక్ లైఫ్ సపోర్ట్‌తో ప్రజల ప్రాణాలను కాపాడే గ్రామీణ వైద్యులే నిజమైన ప్రజా వైద్యులని, అందుకు బేసిక్ లైఫ్ సపోర్ట్‌లపై పిఎంపిలు, ఆర్‌ఎంపిలు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని మాజీ ఎంఎల్‌సి, ఆంధ్రప్రదేశ్ పిఎంపి, ఆర్‌ఎంపి జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు టిడి.జనార్ధన్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ పిఎంపి, ఆర్‌ఎంపిల జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ పిఎంపిలు అంటే సమాజంలో గౌరవం, ప్రతిష్ట ఉండేలా ప్రజలతో మమేకమై, మేలైన వైద్య సేవలందించాలంటే ప్రతి గ్రామీణ వైద్యుడు అధునాతన వైద్య విధానాలపై అవగాహన పొంది ఉండాలని సూచించారు. ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు కెజి గోవింద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్థానిక ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశం ప్రారంభించారు. ధన్వంతరి జయంతి పురస్కరించుకుని ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి మాట్లాడుతూ పిఎంపి, ఆర్‌ఎంపిల సేవలు లేని గ్రామాలను ఊహించలేమని, ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఎల్లప్పుడూ కృషిచేసేది గ్రామీణ వైద్యులేనని అన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ మాట్లాడుతూ పిఎంపి, ఆర్‌ఎంపిలు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలలో పాల్గొని ప్రజలను జాగృతం చేయాలని కోరారు. గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు పేదలపాలిట దైవాలని, అతి తక్కువ ఖర్చుతో, ఎల్లప్పుడూ వైద్య సేవలందించడం అభినందనీయమని అన్నారు. కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమావేశానికి విచ్చేసినందుకు, ఇంతమంది గ్రామీణ వైద్యులను ఒకే వేదికపై చూడడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో జెఎసి గౌరవ సలహాదారు లంకదాసరి ప్రసాదరావు, ఏలూరు పార్లమెంట్ టిడిపి యువనాయకులు పుప్పాల హరీష్, జెఎసి నాయకులు, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ లక్ష్మీసరోజ

## యూత్ ఫెస్టివల్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

**తాడేపల్లిగూడెం :** ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని ఆదిత్య డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ తెలిపారు. తణుకు ఎస్‌కెఎస్‌టి కళాశాలలో శుక్రవారం జరిగిన డిస్ట్రిక్ట్ యూత్ ఫెస్టివల్‌లో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ పి.లక్ష్మీ సరోజ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదిత్య విద్యార్థులంటే ఉద్యోగాలు సాధించడం, దానితో పాటుగా వివిధ కళా రంగాలలో కూడా ప్రతిభను కనబరుస్తారని మరోసారి రుజువు అయ్యిందన్నారు. డైరెక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు చదువు, ఉద్యోగం, కళలలో కూడా ప్రతిభ కనబరుస్తున్నారని తెలియజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రెటరీ సుగుణ రెడ్డి అభినందనలు తెలియజేశారు.

## పాఠశాలల్లో ముందస్తు దీపావళి

**మొగల్తూరు :** పర్యావరణానికి హాని కలిగించకుండా దీపావళిని జరుపుకోవాలని విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని పితాని ఇందిర సూచించారు. మండలంలోని కేపీ పాలెంలో ఉన్న జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శనివారం ఈకో ఫ్రెండ్లీ దీపావళిని ఘనంగా నిర్వహించారు. ఈ దీపావళిని హరిత దీపావళిగా జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచి కడలి కృష్ణమోహన్(సోంబాబు), పంచాయతీ కార్యదర్శి తిరుమాని రవివర్మ, చింతపల్లి కృష్ణమోహన్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

**ఉండి:** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని శ్రీశశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాస్ తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ముందస్తు దీపావళి సంబరాలను నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

## 'బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి'

**గణపవరం :** బాలికలు విద్యలోనే కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలని గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం ముగింపు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి శనివారం స్థానిక బాలికల హైస్కూల్లో బహుమతులు అందజేశారు. హైస్కూల్ హెచ్ఎం వీరవేణి, ఐసిడిఎస్ గణపవరం సూపర్ వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

**నరసాపురం :** అంతర్జాతీయ బాలిక దినోత్సవం వారోత్సవాల వేడుకలు వేములదీవి కాపులకోడప హైస్కూల్‌లో నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గాభవాని మాట్లాడారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు సర్పంచి ఒడుగు ఏసు బాబు, వైస్ సర్పంచి, హెచ్ఎం వి.నాగేశ్వరావు బహుమతులు అందించారు.

## దాతల సహకారం అద్వితీయం

**అన్నపూర్ణమ్మ అన్నదాన సేవ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రభుత్వాసుపత్రికి ఎసి బహూకరణ**

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ప్రభుత్వాసుపత్రికి దాతలందిస్తున్న సహకారాలు అద్వితీయమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శనివారం భీమవరం ప్రభుత్వాసుపత్రికి అన్నపూర్ణమ్మ అన్నదాన సేవ ట్రస్ట్ అధ్యక్షులు తమిరి శరత్ సహకారంతో సుమారు రూ.40 వేలు విలువ కలిగిన ఎసిను అందించారు. ఎంఎల్ఎ అంజిబాబు ఎసిను ప్రారంభించి దాతలను అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులు ఉన్నాయని, దాతల ద్వారా అన్ని సౌకర్యాలు కూడా అందుబాటులో ఉన్నాయని, పేదలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు తమిరి శరత్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ప్రభుత్వాసుపత్రికి ఎసి కావాలని కోరడంతో అందించామన్నారు. ట్రస్ట్ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలి

**వ్యకాస నేత ఎడ్ల చిట్టిబాబు**

నినదిస్తున్న వ్యకాస నేతలు, సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఉపాధి హామీ కార్మికులకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎడ్ల చిట్టిబాబు డిమాండ్ చేశారు. శనివారం భీమవరం మండలం రూరల్ వెంప గ్రామంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు లేని రోజుల్లో పనులు చెప్పాలని చట్టం చెబుతున్నా పనులు చెప్పడం లేదన్నారు. రెండు పూటల పని, రెండు పూటలా మస్టర్ విధానాన్ని రద్దు చేయాలని, పని ప్రాంతాల్లో సౌకర్యాలు, మజ్జిగ, మెడికల్ కిట్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉపాధి పని దినాలు 200 రోజులు పెంచాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా చిలకపాటి ఆనందరావు, కార్యదర్శిగా తోటి శుభకరం, సభ్యులుగా చిలపాటి శకుంతల, వర్ధనపు మరియమ్మ, బాలం సక్కుబాయి, భూపతి తిమోతి, ఇంజేటి రవికుమార్, మంద నాగరత్నం, పెద్దరాజు, చిలకపట్టి చిరంజీవి, నేతల నాగరత్నం ఎన్నికయ్యారు.

## పాఠశాల విద్య బలోపేతానికి క్లస్టర్ కాంప్లెక్సులు : ఎంఇఒ

శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఇఒ-1

**కాళ్ల :** పాఠశాలల విద్య బలోపేతం చేసేందుకు క్లస్టర్ కాంప్లెక్సుల్లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని ఎంఇఒ-1 డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏలూరుపాడు హైస్కూల్లో శనివారం క్లస్టర్ కాంప్లెక్స్‌ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి క్లస్టర్ ఛైర్మన్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గంగా భవాని అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రాథమిక ఉపాధ్యాయులకు, సెకండరీ ఉపాధ్యాయులకు వేర్వేరు అజెండాలు ఉన్నాయి. 1, 2 తరగతుల ఉపాధ్యాయులకు, 3, 4, 5 తరగతుల ఉపాధ్యాయులకు వేరువేరుగా రిసోర్స్ పర్సన్‌లను నియమించి వేరువేరు సమావేశాలు నిర్వహించారు. సెకండరీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఏడు రకాల సబ్జెక్టుల టీచర్లను వర్గీకరణ చేసి సమావేశాలు నిర్వహించారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని కాంప్లెక్స్‌లు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు నాలుగు హైస్కూల్స్, 13 ప్రాథమిక పాఠశాలలు మొత్తం 72 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ శంకరావు, వేగేశ్న జానకీ రామరాజు, సిఆర్ఎంటి అప్పారావు పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ సంబరాల విజేతలకు బహుమతుల ప్రదానం

**భీమవరం టౌన్ :** అన్నాకోడేరు డిఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన పాఠశాల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు-2025 నిర్వహించారు. ఈ సంబరాల్లో 8, 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థులు 80 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.సూర్య భగవాన్ రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందిస్తాయని, సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందిస్తాయని, శాస్త్ర సాంకేతిక రంగాలలో రాణించడానికి దోహదపడతాయని అన్నారు. పాఠశాల స్థాయిలో విజేతలైన విద్యార్థులు నవంబర్ ఒకటో తేదీన జరిగే మండల స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల స్థాయి విజేతలుగా జి.జయనాగ సుమశ్రీ, ఎం.హాసిని, కె.హర్షవర్ధన్‌లను ప్రకటించారు. వీరిని అభినందిస్తూ ప్రధానోపాధ్యాయులు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వనజ, కెవివి.సాగర్ రాజు, ఎంవి.శ్రీలక్ష్మి, ఎన్.శారద, ఎస్.మావుళ్లమ్మ, బి.జోత్స్న, కె.రాజేష్ కుమార్ రాజు, జిఎస్.విజయలక్ష్మి, సిహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎఎంసిల ఆదాయంపై పాలకవర్గానిదే పెత్తనం : మంత్రి

**పాలకొల్లు :** రాష్ట్రంలో రైతాంగానికి, ప్రజలకు మేలు జరిగేలా వ్యవసాయ మార్కెట్ కమిటీకి సెస్ ద్వారా వచ్చే ఆదాయం పాలకవర్గాలే నిర్ణయం తీసుకోవడంతో పాటు స్వయం ప్రతిపత్తి కలిగేలా సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, తద్వారా పాలకవర్గాలకు గౌరవం పెరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు అన్నారు. పాలకొల్లులో శనివారం జరిగిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అధ్యక్షత వహించారు. ముందుగా పాలకవర్గ అధ్యక్షునిగా కోడి విజయభాస్కర్, ఉపాధ్యక్షునిగా రాపాక రత్నంరాజు, డైరెక్టర్లతో మంత్రి రామానాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. సభలో రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని పాల్గొన్నారు.

## 'గాలి కాలుష్యం తగ్గిస్తేనే అందరికీ ఆరోగ్యం'

**పోడూరు :** గాలి కాలుష్యం తగ్గించి ప్రజల ఆరోగ్యం కాపాడాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కెబికె ఎస్.రమేష్ రెడ్డి అన్నారు. స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యాన శనివారం పోడూరులో నిర్వహించిన 'స్వచ్ఛ ఆంధ్రా- స్వర్ణ ఆంధ్రా' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గాలి నాణ్యతపై అవగాహన పెంచాలని, ప్రజల భాగస్వామ్యంతో గాలి కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ ఆరోగ్యం మెరుగుపరచాలన్నారు. ప్రతీ వారంలో ఒక రోజు వాహనరహిత దినంగా పాటించడం, సైకిల్ మీద వెళ్లడం, నడవడం, చెట్లు పెంచడం, సంరక్షణ-సోలార్, బయోగ్యాస్ వంటివి వినియోగించడం, పంట అవశేషాలు కాల్చకూడదని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి జె.సత్యనారాయణ, పిహెచ్ఎన్ ఎస్.మీరమ్మ, హెచ్‌విసి హెచ్.పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

**గణపవరం :** స్వర్ణాంధ్రా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పిహెచ్‌సి సిబ్బందితో సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి కాలుష్యం తగ్గించుకొని ప్రజల ఆరోగ్యం కాపాడుకోవలసిన అవసరం ఉందని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**మొగల్తూరు :** పర్యావరణ పరిరక్షణతో స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనం ఉంటుందని తహశీల్దార్ కె.రాజ కిషోర్ అన్నారు. మండల కేంద్రం మొగల్తూరులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో డిటి సుగుణ సంధ్య, డిప్యూటీ ఎంపిడిఒ మేడిది నవీన్ కిరణ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

**ఉండి :** పారిశుధ్య రహిత గ్రామంగా ఉండిని నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపిడిఒ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉండి హై స్కూల్ నుంచి కలిదిండి అబ్బాయి రాజు జన్మభూమి పార్క్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ కె.సూర్యనారాయణ రాజు, మండల విస్తరణాధికారి సిహెచ్ ఎస్‌వి రెడ్డి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, పాల్గొన్నారు.

**ఆచంట :** ప్రతీ 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల ప్రభుత్వం స్వచ్ఛమైన గాలి అనే అంశంపై అవగాహన కల్పించడంలో భాగంగా శనివారం ఆచంట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులు, అధికారులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ బిఎస్ఎస్.కృష్ణమోహన్, డిస్ట్రిబ్యూటరి కమిటీ ఛైర్మన్ తమ్మినీడి ప్రసాద్, కేతా మీరయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

### పేరు మార్పు

బ్రమర శ్రీనివాసరావు, తండ్రి: బ్రవర సూర్యనారాయణ, గుండుగోలను, భీమడోలు మండలం (పోలీస్ డిపార్ట్మెంట్) అను నన్ను ఇక నుండి బ్రవర శ్రీనివాసరావు, తండ్రి: బ్రవర సూర్యనారాయణ గా పిలిచేలా సవరిస్తూ మరియు నా ఆఫీసు రికార్డ్ ల సవరణ నిమిత్తం ది. 29-07-1997 తేదీన AP Gazette Notification ప్రచురించినందున కోరడమైనది.

### In The Court Of The Civil Judge (Junior Division) at Bhimadole, Eluru Dt
**O.S.No. 113/2024**

***Between:***

కె. రాంబాబు ...Plaintiff

మరియు

వై. రామలక్ష్మి వగైరాలు ...Defendants

**To.** యనమండ్ర రామలక్ష్మి, W/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం.(**D1**)
**2.** యనమండ్ర విశ్వతేజ, S/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D2**)
**3.** యనమండ్ర వైష్ణవి, D/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D3**)

పై నెంబరు దావాను వాది అయిన కె. రాంబాబు భీమడోలు కోర్టులో ప్రతివాదులపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా గ్రంథములో 1వ, 2వ, 3వ ప్రతివాదులైన 1.యనమండ్ర రామలక్ష్మి, 2. యనమండ్ర విశ్వతేజ, 3. యనమండ్ర వైష్ణవి భీమడోలు వార్కి నోటీసు నిమిత్తం **ది. 27-10-2025 తేదీకి** వాయిదా అయివున్నది. కావున 3గురు ప్రతివాదులు కోర్టు వారు ఎదుట **ది. 27-10-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్స్‌పార్టీ చేసి దావా తీర్మాణము చేయబడును.

(శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం)

**ఎస్. గోపాలకృష్ణ**
**ఎల్. సుధారాణి**

భీమడోలు వాది తరుపు న్యాయవాదులు,
ది.10-10-2025 భీమడోలు
సెల్ నెం: 93913 35373

### వేలం ప్రకటన
**మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో**
**E.P. No. 32/2019 in OS. No. 190/2013**

***Between:***

**వాదులు/డిక్రీ హోల్డర్స్:** శిద్దాని వెంకట కోట సత్య సూర్యవతి (died) అండ్ 6 others

**Vs**

**ప్రతివాది/జె.డి.ఆర్:** కొట్టు రామాంజనేయులు

పై నెంబరు అమలు గ్రంధములో వాదులు/డిక్రీ హోల్డర్స్‌కు రావలసిన డిక్రీ బాకీ రాబట్టుకొనే నిమిత్తం జె.డి.ఆర్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది. 10-11-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని.లకు** లగాయతు నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు వేలం వేయబడును. కావున సదరు వేలంలో పాల్గొని పాట పాడుకోవలసినదిగా యిందుమూలముగా యావన్మందికి తెలియ పరచడమైనది.

**షెడ్యూలు**

పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు సబ్ రిజిస్ట్రారులో చేరిన మొగల్తూరు మండలం, రామన్నపాలెం గ్రామ పంచాయితీ ఏరియా, మొగల్తూరు రెవెన్యూ గ్రామం తాలూకు **ఆర్.యస్.నెం.1081లో పూరా య.9-60 సెంట్లలో పడమర వైపున, య.5-30 సెంట్లలో య.2-65 సెంట్లకు హద్దులు.**

**తూర్పు :** కొట్టు వెంకట సత్యలక్ష్మి పద్మావతిగారి భూమి
**దక్షిణము :** గన్నాబత్తుల కృష్ణమూర్తిగారి భూమి
**పడమర :** మునగాల రామారావుగారి భూమి
**ఉత్తరం :** అనంతపల్లి రామమోహనరావుగారి భూమి

యీ హద్దుల మధ్య గల య.2-65 సెంట్లు భూమిన్ని సదరు భూమిలోనికి నీటి వనరులు మరియు దారి మార్గపు హక్కులతో సహా

**డి.హెచ్.ఆర్.విలువ: Rs. 8,68,623/-**
**అమీనా విలువ: Rs. 35,75,000/-**

**ముత్యాల వెంకట సుబ్బారావు**

నరసాపురం అడ్వకేటు
ది.18-10-2025 నరసాపురం- 534275,
సెల్: 94913 73687

### దావా సమను
**మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో**
**O.S.No. 34/2015**

*Between:*

1. శ్రీ గడ్డి జయ ఆదిత్య దుర్గ ఫణీంద్ర
2. శ్రీ దాడి మురళీ సాయి పవన్ కుమార్

**-వాదులు**

మరియు

1. శ్రీమతి గడ్డి సూరమ్మ (డైడ్)
2. గడ్డి వెంకటేశ్వరరావు (డైడ్)
3. గడ్డి సూరిబాబు & వగైరా **-ప్రతివాదులు**

***ప్రతివాదులు 7 టు 12:***

7. శ్రీమతి కె.లక్ష్మి భర్త: ఉమా మహేశ్వరరావు,
8. బొజ్జ సాగర్, తండ్రి : నాగేశ్వరరావు,
9. బొజ్జ సౌజన్య, తండ్రి: నాగేశ్వరరావు,

*(7 టు 9 ప్రతివాదులు నివాసం : డోర్ నెం. 9-1-95, పెద్ద పోస్టాఫీసు వీధి, పెద్ద రామాలయం వద్ద, జంగారెడ్డిగూడెం, ప్రస్తుతం ఏలూరు జిల్లా).*

10. శ్రీమతి గడ్డి వెంకటరమణ, భర్త: లేటు వెంకటేశ్వరరావు,
11. గడ్డి వెంకట కృష్ణ కిషోర్, తండ్రి : లేటు వెంకటేశ్వరరావు,
12. చనపతి మహేశ్వరి, భర్త: నాగేశ్వరరావు

*(10 టు 12 ప్రతివాదులు నివాసం : డోర్నెం. 8-117, ఇ-సేవ కేంద్రం వద్ద, పంగిడిగూడెం రోడ్డు, జంగారెడ్డిగూడెం, ప్రస్తుతం ఏలూరు జిల్లా). (ఐ.ఎ.నెం. 163/2022, తేది: 03.01.2025 ఉత్తర్వుల ప్రకారం ప్రతివాదులు 79. మరణించిన 1వప్రతివాది యొక్క వారసులుగా ఈ దావాలో చేర్చబడినారు). (ఐ.ఎ.నెం. 163/2022, తేది: 03.01.2025 ఉత్తర్వుల ప్రకారం ప్రతివాదులు 10 టు 12, మరణించిన 2వ ప్రతివాది యొక్క వారసులుగా ఈ దావాలో చేర్చబడినారు).*

పై నెంబరు దావాలో ప్రతిపాదిత 7 టు 12 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించుచున్ననూ, వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిలువరించుచున్నారు. కావున, మీరు **ది. 30-10-2025వ తేదీ, ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టు వారి సమక్షమున స్వయంగా గాని, లేదా వకీలు ద్వారా గాని, హాజరు అయి, మీకు ఆక్షేపణలు ఏమైనా వున్నచో తెలియపరచుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

**అల్లూరి సుధా దీపిక**
అడ్వకేట్ కొవ్వూరు
**శ్రీ బి.వి. కృష్ణారెడ్డి,**
స్థలం: కొవ్వూరు, అడ్వకేట్, ఏలూరు.
తేది:17-10-2025. సెల్: 9346792907

### In The Court Of The Civil Judge (Junior Division) at Bhimadole, Eluru Dt
**I.A.No. 676/2024 in O.S.No. 100/2024**

***Between:***

ఎన్. కొండలరావు ...Plaintiff

మరియు

వై. రామలక్ష్మి వగైరాలు ...Defendants

**To.** యనమండ్ర రామలక్ష్మి, W/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం.(**D1**)
**2.** యనమండ్ర విశ్వతేజ, S/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D2**)
**3.** యనమండ్ర వైష్ణవి, D/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D3**)

పై నెంబరు దావాను వాది అయిన ఎన్. కొండలరావు భీమడోలు కోర్టులో ప్రతివాదులపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా గ్రంథములో 1వ, 2వ, 3వ ప్రతివాదులైన 1.యనమండ్ర రామలక్ష్మి, 2. యనమండ్ర విశ్వతేజ, 3. యనమండ్ర వైష్ణవి భీమడోలు వార్కి నోటీసు నిమిత్తం **ది. 27-10-2025 తేదీకి** వాయిదా అయివున్నది. కావున 3గురు ప్రతివాదులు కోర్టు వారు ఎదుట **ది. 27-10-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్స్‌పార్టీ చేసి దావా తీర్మాణము చేయబడును.

(శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం)

**ఎస్. గోపాలకృష్ణ**
**ఎల్. సుధారాణి**

భీమడోలు వాది తరుపు న్యాయవాదులు,
ది.10-10-2025 భీమడోలు
సెల్ నెం: 93913 35373

### In The Court Of The Civil Judge (Junior Division) at Bhimadole, Eluru Dt
**I.A.No. 720/2024 in O.S.No. 113/2024**

***Between:***

కె. రాంబాబు ...Plaintiff

మరియు

వై. రామలక్ష్మి వగైరాలు ...Defendants

**To.** యనమండ్ర రామలక్ష్మి, W/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం.(**D1**)
**2.** యనమండ్ర విశ్వతేజ, S/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D2**)
**3.** యనమండ్ర వైష్ణవి, D/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D3**)

పై నెంబరు దావాను వాది అయిన కె. రాంబాబు భీమడోలు కోర్టులో ప్రతివాదులపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా గ్రంథములో 1వ, 2వ, 3వ ప్రతివాదులైన 1.యనమండ్ర రామలక్ష్మి, 2. యనమండ్ర విశ్వతేజ, 3. యనమండ్ర వైష్ణవి భీమడోలు వార్కి నోటీసు నిమిత్తం **ది. 27-10-2025 తేదీకి** వాయిదా అయివున్నది. కావున 3గురు ప్రతివాదులు కోర్టు వారు ఎదుట **ది. 27-10-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్స్‌పార్టీ చేసి దావా తీర్మాణము చేయబడును.

(శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం)

**ఎస్. గోపాలకృష్ణ**
**ఎల్. సుధారాణి**

భీమడోలు వాది తరుపు న్యాయవాదులు,
ది.10-10-2025 భీమడోలు
సెల్ నెం: 93913 35373

### In The Court Of The Civil Judge (Junior Division) at Bhimadole, Eluru Dt
**I.A.No. 724/2024 in O.S.No. 114/2024**

***Between:***

జి. సెల్వీ కుమార్ ...Plaintiff

మరియు

వై. రామలక్ష్మి వగైరాలు ...Defendants

**To.** యనమండ్ర రామలక్ష్మి, W/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం.(**D1**)
**2.** యనమండ్ర విశ్వతేజ, S/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D2**)
**3.** యనమండ్ర వైష్ణవి, D/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D3**)

పై నెంబరు దావాను వాది అయిన జి. సెల్వీ కుమార్ భీమడోలు కోర్టులో ప్రతివాదులపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా గ్రంథములో 1వ, 2వ, 3వ ప్రతివాదులైన 1.యనమండ్ర రామలక్ష్మి, 2. యనమండ్ర విశ్వతేజ, 3. యనమండ్ర వైష్ణవి భీమడోలు వార్కి నోటీసు నిమిత్తం **ది. 27-10-2025 తేదీకి** వాయిదా అయివున్నది. కావున 3గురు ప్రతివాదులు కోర్టు వారు ఎదుట **ది. 27-10-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్స్‌పార్టీ చేసి దావా తీర్మాణము చేయబడును.

(శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం)

**ఎస్. గోపాలకృష్ణ**
**ఎల్. సుధారాణి**

భీమడోలు వాది తరుపు న్యాయవాదులు,
ది.10-10-2025 భీమడోలు
సెల్ నెం: 93913 35373

### In The Court Of The Civil Judge (Junior Division) at Bhimadole, Eluru Dt
**O.S.No. 114/2024**

***Between:***

జి. సెల్వీ కుమార్ ...Plaintiff

మరియు

వై. రామలక్ష్మి వగైరాలు ...Defendants

**To.** యనమండ్ర రామలక్ష్మి, W/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం.(**D1**)
**2.** యనమండ్ర విశ్వతేజ, S/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D2**)
**3.** యనమండ్ర వైష్ణవి, D/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D3**)

పై నెంబరు దావాను వాది అయిన జి. సెల్వీ కుమార్ భీమడోలు కోర్టులో ప్రతివాదులపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా గ్రంథములో 1వ, 2వ, 3వ ప్రతివాదులైన 1.యనమండ్ర రామలక్ష్మి, 2. యనమండ్ర విశ్వతేజ, 3. యనమండ్ర వైష్ణవి భీమడోలు వార్కి నోటీసు నిమిత్తం **ది. 27-10-2025 తేదీకి** వాయిదా అయివున్నది. కావున 3గురు ప్రతివాదులు కోర్టు వారు ఎదుట **ది. 27-10-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్స్‌పార్టీ చేసి దావా తీర్మాణము చేయబడును.

(శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం)

**ఎస్. గోపాలకృష్ణ**
**ఎల్. సుధారాణి**

భీమడోలు వాది తరుపు న్యాయవాదులు,
ది.10-10-2025 భీమడోలు
సెల్ నెం: 93913 35373

### In The Court Of The Civil Judge (Junior Division) at Bhimadole, Eluru Dt
**O.S.No. 100/2024**

***Between:***

ఎన్. కొండలరావు ...Plaintiff

మరియు

వై. రామలక్ష్మి వగైరాలు ...Defendants

**To.** యనమండ్ర రామలక్ష్మి, W/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం.(**D1**)
**2.** యనమండ్ర విశ్వతేజ, S/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D2**)
**3.** యనమండ్ర వైష్ణవి, D/o. (లేటు) దుర్గాప్రసాద్, శాంతి కాన్వెంట్ వద్ద, భీమడోలు, భీమడోలు మండలం. (**D3**)

పై నెంబరు దావాను వాది అయిన ఎన్. కొండలరావు భీమడోలు కోర్టులో ప్రతివాదులపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా గ్రంథములో 1వ, 2వ, 3వ ప్రతివాదులైన 1.యనమండ్ర రామలక్ష్మి, 2. యనమండ్ర విశ్వతేజ, 3. యనమండ్ర వైష్ణవి భీమడోలు వార్కి నోటీసు నిమిత్తం **ది. 27-10-2025 తేదీకి** వాయిదా అయివున్నది. కావున 3గురు ప్రతివాదులు కోర్టు వారు ఎదుట **ది. 27-10-2025 తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారిని ఎక్స్‌పార్టీ చేసి దావా తీర్మాణము చేయబడును.

(శ్రీ కోర్టు వారు ఆర్డరు ప్రకారం)

**ఎస్. గోపాలకృష్ణ**
**ఎల్. సుధారాణి**

భీమడోలు వాది తరుపు న్యాయవాదులు,
ది.10-10-2025 భీమడోలు
సెల్ నెం: 93913 35373